# క్రియ ఆధ్వర్యంలో పిల్లల పండుగ

ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించే లక్ష్యంతో ' క్రియ - స్వచ్ఛంద సంస్థ' పాఠశాలలలో ఈ దిగువ కార్యక్రమములు నిర్వహించి, బహుమతులు అందచేయుచున్నది.

## 1 నుండి 3 తరగతులకు

1. అభినయ గేయములు - ఈ పోటీలో 'చిట్టి చిలకమ్మా' 'చుక్ చుక్ రైలు వచ్చింది' మొదలగు గేయాలను అభినయంతో పిల్లలచే పాడించడం జరుగుతుంది.
2. ఇచ్చిన బొమ్మలకు రంగులు వేయుట - ఈ పోటీలో ఒకటి నుండి మూడు తరగతుల పిల్లలకు 'లైన్ డ్రాయింగ్' వేసి ఉన్న కాగితాలు ఇవ్వబడును. వాటిపై ఉన్న బొమ్మలకు సరిపడు రంగులు వేయాలి. ప్రతి విద్యార్థికి ఒక క్రేయాన్ సెట్ , రెండు లైన్ డ్రాయింగ్ ఉన్న కాగితములు ప్రాక్టీసు కొరకు ముందుగా ఇవ్వబడును. పోటీల రోజు కంటే ముందుగానే ఇచ్చిన రెండు కాగితములలో రెండు సార్లు ప్రాక్టీసు చేయించవలెను. క్రేయాన్లు పిల్లలు ఇంటికి తీసుకుపోకుండా, పాఠశాలలో ఉంచుకోవాలి. పోటీల రోజు మరొక లైన్ డ్రాయింగ్ ఉన్న కాగితం ఇవ్వబడును. క్రేయాన్లు మాత్రము ముందుగా ఇచ్చిన వాటినే ఉపయోగించవలయును. పోటీల రోజు పిల్లలందరినీ పెన్సిల్, రబ్బరు తెచ్చుకోమని చెప్పాలి.
3. తెలుగు పదములు చదువుట (2, 3 తరగతులకు మాత్రమే) - ఈ పోటీలలో రెండవ తరగతి పిల్లలతో ఒకటవ తరగతి స్థాయి పదములను, మూడవ తరగతి పిల్లలతో రెండవ తరగతి స్థాయి పదములను చదివించడం జరుగుతుంది.
4. కథలు చెప్పుట - పాఠశాలలోగాని, ఇంట్లో గాని నేర్చుకున్న కథలను పిల్లలు చెప్పవచ్చు.
5. పరుగు పందెం - తరగతుల వారిగా అమ్మాయిలకు, అబ్బాయిలకు వేరు వేరుగా ఒకటి, రెండు రోజుల ముందు కనీసం 200 మీటర్లు పరుగు పందెం నిర్వహించి ఫలితాలు నమోదు చేసి ఉంచాలి.
6. మట్టి, కాగితం, వంటి వాటితో బొమ్మలు, నమూనాలు తయారు చేయుట - ఈ పోటిల కొరకు పిల్లలు ముందుగా నమూనాలను పాఠశాలలో తయారు చేసి వాటిని పోటి జరిగే రోజున ప్రదర్శించవచ్చు. బడిలో ఉపాధ్యాయుల సమక్షంలో బొమ్మలు తయారు చేయించాలి. ఇంటి వద్ద తయారు చేసే అవకాశం ఇస్తే పెద్దవారు తయారు చేసే అవకాశం కలదు. మట్టి బొమ్మలు తయారు చేయుటకు అవసరమైన మట్టిని పెద్ద తరగతుల పిల్లలతో ఎక్కువగా ఒకేసారి తెప్పించి బడిలో ఒక పూట సమయం మట్టి బొమ్మలు తయారు చేసుకోవడానికి కేటాయించితే అందరు పిల్లలు ఈ అంశంలో పాల్గొనే వీలు ఉంటుంది.
7. ప్రాజెక్ట్ పని - సర్వ శిక్ష అభియాన్ వారు ప్రాజెక్ట్ పని పేరుతో 1,2,3 తరతులకు ఒక పుస్తకం, 4, 5 తరగతులకు ఒక పుస్తకం సరఫరా చేసి ఉన్నారు. వాటి నుండి గాని ఆయా తరగతి స్థాయికి సరిపడు వేరే ప్రాజెక్ట్ లు గాని చేయించవచ్చు. తరగతుల పిల్లలను రకరకాల ఆకులు, పువ్వులు సేకరించమని, వాటిని పేపరుపై అంటించి వాటి పేర్లను పిల్లలతో చెప్పించి, చెప్పిన పేర్లను ఉపాధ్యాయులు వ్రాయవచ్చు.

## 4 మరియు 5 తరగతులకు

1. అ) తెలుగు అచ్చు పుస్తకం నందు పాఠము చివర గల పదములకు అర్థములను చూసి ప్రశ్నపత్రంలో ఇచ్చిన పదములకు అర్థములు వ్రాయవలెను.

ఆ) కూడికలు, తీసివేతలు, గుణకారములు, భాగహారములు మరియు చిన్న చిన్న రాత లెక్కలు

ఇ) బొమ్మల చార్టును చూసి ఇంగ్లీషులో ఆ బొమ్మల పేర్లు రాయవలెను.

ఈ) వస్తువులను చూసి తెలుగులో వాటి పేర్లు రాయవలెను.

'అ' మరియు 'ఆ' అంశములకు ప్రింట్ చేయబడిన ప్రశ్నాపత్రం పిల్లలందిరికి ఇవ్వబడును. పిల్లలను తెలుగు అచ్చు పుస్తకం పోటీల రోజు తప్పని సరిగా తెచ్చుకోమని చెప్పాలి.

2. బొమ్మలు గీసి రంగులు వేయుట - లైన్ డ్రాయింగ్ వున్న కాగితములకు బదులు తెల్ల కాగితములు ఇవ్వబడును. మిగిలిన సూచనలు పైన తెలిపినవే వర్తించును.
3. సృజనాత్మక కృత్యాలు - మట్టి, కాగితము వంటి స్థానికముగా తక్కువ ఖర్చుతో లభించు సామగ్రితో బొమ్మలు, నమూనాలు తయారు చేయుట. మిగిలిన సూచనలు పైన తెలిపినవే వర్తించును.
4. పాఠశాల గ్రంధాలయంలో విద్యార్థి చదివిన ఏదేని పుస్తకములోని కధ చెప్పుట.
   ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతి గదిలోను గ్రంధాలయ పుస్తకములు పిల్లలకు అందుబాటులో వున్నాయి. ఎంతో ఆసక్తితో పిల్లలు వాటిలోని కధలను చదువుతుంటారు. అలా చదివిన కధలను చక్కటి హావభావాలతో, వాయిస్ మాడ్యులేషన్స్ తో (రకరకాల పక్షులు, జంతువులు ఆయా కధలలో వచ్చినప్పుడు వాటి అరుపులను అనుకరించడం, కధలలో వచ్చిన సందర్భాన్ని బట్టి చిన్న పిల్లల్లా, ముసలివారిలా మాట్లాడటం) మిగిలిన పిల్లలు ఆసక్తితో వినే విధంగా స్పష్టంగా, అందరికి వినిపించేలా చెప్పాలి.
5. సైన్స్ ప్రయోగం చేసి వివరించుట. - 4 మరియు 5 తరగతుల స్థాయికి సరిపడు సైన్సు ప్రయోగాలను చేస్తూ వాటిని వివరించాలి. ఒక ప్రయోగం ఒకరు మాత్రమే చెయ్యాలి, ఇద్దరు ముగ్గురు కలిసి ఒక ప్రయోగం చేయుట అనుమతింపబడదు.
6. పాటలు పాడుట - మంచి అర్థం గల సినిమా పాటలు కూడా పాడవచ్చు. బృంద గానములు అనుమతింపబడవు.
7. ఆటలు - పరుగు పందెం (కనీసం 400 మీ.) - మిగిలిన సూచనలు పైన తెలిపినవే వర్తించును.
8. ప్రాజెక్ట్ పని - ఇద్దరిద్దరు విద్యార్థులు ఒక బృందంగా ఏర్పడి ఒక ప్రాజెక్ట్ చేయవచ్చు. గ్రామంలో గల ప్రార్థనాలయాల వివరాలు, వివిధ రవాణా సాధనాలు, పండుతున్న పంటలు, పంటలకు వస్తున్న తెగుళ్ళు, వాటికి వాడే మందులు, ఒక ఎకరానికి అయ్యే ఖర్చు, రాబడి వివరాలు, ఇళ్ళ రకాలు, కిరానా కొట్టులోనే వివిధ వస్తువుల ఖరీదు, గ్రామములో వివిధ వృత్తుల వివరాలు, ఇలా అనేక ప్రాజెక్టు చేయించవచ్చు. పిల్లలతో రకరకాల ప్రాజెక్టు చర్చించి వారికి నచ్చిన వాటిని ఎన్నుకోమని, అవసరమయిన ప్రోఫార్మాను వారితోనే రాయించి ఒక పూట లేదా ఒక రోజు గ్రామంలో తిరగమని సమాచార సేకరణ చేయించాలి. సేకరించిన సమాచారాన్ని వర్గీకరించి పోటిల రోజు సదరు ప్రాజెక్టు చూపి, వివరించాలి.

9. సాంస్కృతిక అంశములు - నాటికలు, ఏకాంకికలు, ఏకపాత్రాభినయం, మిమిక్రి, జానపద లేదా శాస్త్రీయ నృత్యం, పాఠమును నాటకీకరణ చేసి చూపుట మొదలైనవి.
   'పాటలు పాడుట'ను ఒక అంశముగా నిర్వహించి ఉన్నాము కావున సాంస్కృతిక అంశముల వేదిక పై పాటలు పాడుట వుండదు. సినిమా డాన్స్ లు అనుమతింపబడవు.